# కొత్తనీరు

కప్పగంతుల మల్లికార్జునరావు




ఎవరో లేపినట్లు నేను నిద్ర లేచాను.

హిందూ సంస్కృతిలా ఉదయసూర్యుని బింబం కన్పించింది.

గోదావరి రైల్ కమ్ రోడ్ బ్రిడ్జి ద్వారా ఆ బింబ రూపం పవిత్ర గోదావరి నదిలో ప్రతిఫలించి భిన్న భిన్న ప్రతిబింబాలుగా మెరుస్తోంది.

ధార్మికులు గోదావరిలో స్నానాలు చేస్తున్నారు. సూర్యనమస్కారాలు చేస్తున్నారు. మార్కండేయస్వామి దేవాలయంలో గంటల ధ్వని తియ్యగా విన్పిస్తోంది.

చదువుకొనే రోజుల్నించి నాకు పొద్దుపోయే దాకా మేలుకోవటం, తెల్లవారి బాగా పొద్దెక్కి లేవటం అలవాటు. అడ్వకేట్ వృత్తిలోకి దిగాక కూడా ఆ అలవాటు కొనసాగుతోంది.

ఆ పాపిష్ఠి అలవాటు హాస్పిటల్‌లో ఆపరేషన్ పుణ్యాన ఇవాళతో పోయింది.

ఆపరేషన్ అయిన రెండో రోజు నిద్ర మందు ప్రభావం త్వరగా జారిపోయింది.

కళ్లు తెరిచి చూస్తే అద్భుత దృశ్యం!

పాదార్థిక విలువల వెంపర్లాటలో నేను ఎలా అంధుడి నయ్యానో గ్రహించాను. అలారం పెట్టుకొని సరిగ్గా సూర్యోదయ సమయానికి నిద్ర లేచేవాడిని. ఇప్పుడు ఆ అవసరం లేకుండానే లేచిపోతున్నాను.

"సత్యం వద! ధర్మం చర! సత్యాన్న ప్రమదితవ్యమ్! ధర్మాన్నప్రమదితవ్యమ్! కుశలాన్నప్రమదితవ్యమ్! మాతృదేవోభవ! పితృదేవోభవ! ఆచార్యదేవోభవ! అతిథి దేవో భవ!"

ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించాక వేద శ్రవణం నాకు అలవాటయింది.

నే నున్న హాస్పిటల్ ధనదర్పంతో ఎత్తుగా ఉంటుంది.

ఆ భవనం చుట్టూ ఎటు చూచినా ధనాహంకారమే కన్పిస్తుంది. మందులు, హొటళ్లు, బార్స్, ఎటు చూచినా విదేశీ హోరు. పాతాళం నుంచి ఆకాశం వరకు కాలుష్య ప్రవాహాలు.

వాటి మధ్య నూట యాభై సంవత్సరాల వయసున్న ఒక పాతకాలపు భవంతి.

రాజమహేంద్రపురంలో ఇన్నీస్‌పేటలోని ఆ ఇల్లు ఒకప్పుడు సాహిత్య సంస్కృతులకు, వేద విద్యలకు కేంద్రమని మా నాన్నగారు నాకు చిన్నప్పుడు చెప్పేవారు.

కానీ అందరిలాగే నేనూ ధనార్జనలో పడి ఆ ఇంటిని మర్చిపోయాను.

ఆపరేషన్ పుణ్యాన మళ్లీ ఆ ఇంటితో నా కిప్పుడీ పరిచయం ఏర్పడింది.

నా గది వెనుక భాగాన ఉన్న బాల్కనీలోకి వస్తే ఆ భవనం పెరటి భాగం కన్పిస్తుంది.

ఏనాటివో రెండు పెద్ద మామిడి చెట్లూ, ఒక పనస చెట్టూ, ఎత్తుగా ఠీవిగా ఉన్న కొబ్బరి చెట్లూ, పున్నాగ చెట్టూ....

తెలతెలవారుతుండగానే చెట్ల మీద పక్షులు రకరకాల శబ్దాలు చేసుకొంటూ ఎక్కడికో ఎగిరిపోతాయి.

ఆ భవంతిలో ఇప్పుడు ఒక ముసలి జంట ఉన్నట్లుంది.

ముసలామె ఉదయాన్నే లేచి స్నానం చేస్తుంది. తులసీ దళాలు కోస్తుంది. పున్నాగ పూలను కొన్నింటిని మెల్లగా వంగి ఏరుకొంటుంది. చిన్న కర్రతో మందార మొక్క కొమ్మల్ని వంచి మందార పూలు కోస్తుంది.

లోపల ఏవో పూజా మంత్రాలు విన్పిస్తాయి కాస్సేపు.

ఆ తర్వాత ముసలామె, ముసలాయనను మెల్లగా చెయ్యి పట్టుకొని నడిపించుకొని వచ్చి, మామిడి చెట్టు కింద చుట్టూతా గల గట్టు మీద కూర్చోపెడ్తోంది.

ముసలాయన కాస్సేపు వేద పఠనం చేస్తాడు.

అప్పుడు రెండు పెద్ద గ్లాసులతో ముసలామె లోపలి నుంచి వస్తుంది.

ఇద్దరూ మెల్లగా గ్లానుల్ని ఖాళీ చేస్తారు.

ఆ తర్వాత ఆమె మెల్లగా మామిడి పిందెల్ని ఏరుతోంది. ఆకు కూరల్ని కోస్తుంది.

మొదట్లో ఆయన గొంతు వేద ఘోషతో ఖంగున మ్రోగేది. కానీ నాలుగయిదు రోజులుగా ఆయనకు ఆరోగ్యం సరిగ్గా లేనట్లుంది. గొంతు శృతి తగ్గింది. మధ్య మధ్య ఆయన దగ్గుతుంటే చదివే పనసల సంఖ్య కూడా తగ్గిపోయింది.

"కన్త్వం కోహం కుత ఆయాతః
కామే జననీ కోమే తాతః"

ఉలిక్కిపడ్డాను. అది ముసలామె గొంతు అయి ఉండాలి.

బాల్కనీ వైపు వెళ్లి చూచాను.

ముసలామే!

రోజా ముసలాయన కూర్చొనే చోటులో కూర్చొని కళ్లు మూసుకొని భజగోవింద శ్లోకాలు చదువుతోంది.

ఆ వయసులో కూడా ఆమెగొంతులో మాధుర్యం ఉంది. కానీ ఆ మాధుర్యం వెనుక ఏదో ఆవేదన స్పష్టంగా విన్పిస్తున్నది.

ఆ ముసలాయన కేమయిందివాళ?

వేద మంత్రాల బదులు శ్లోకాలు విన్పించటానికి కారణమేమిటి?

హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేసిందాకా ఈప్రశ్నలకు సమాధానాలు తెలుసుకొనే అవకాశం నాకు లభించలేదు.

ఆ భవంతిలోకి ప్రవేశిస్తుంటే అనిర్వచనీయమైన ఆనందానుభూతి కలిగింది. ఏదో థ్రిల్‌తో మనస్సంతా నిండిపోయింది.

లోపలికి ప్రవేశించగానే పేద్ద హాలు. హాలుకు అటువైపు ఇటు వైపు గదులు. ఒకప్పుడు వేద ఘోషలతో, పండిత చర్చలతో, సాహితీ సదస్సులతో, గాన కచేరీలతో, నాట్య నాటక ప్రదర్శనలతో కళకళలాడిన హాలు అయి ఉండవచ్చు అది.

కానీ ఇప్పుడది మాసిపోయి, పెచ్చులూడిపోతున్న గోడలతో, బూజుతో, దుమ్ము ధూళితో, భయంకర నిశ్శబ్దంతో, నక్షత్రాలు లేని ఆకాశంలా ఉంది.

థ్రిల్ స్థానంలో మనసులో ఏదో దిగులు భావన ప్రవేశించింది.

నా పిలుపు విని లోపలి నుంచి ముసలామె వచ్చింది.

నా అనుమానం భయం నిజమయాయి, ఇంత భవంతిలో ముసలి దంపతులు మాత్రమే ఉంటున్నారన్నమాట!

"కూర్చో నాయనా! ఏం కావాలి?"

లాంఛనంగా అందే కాని అక్కడ కూర్చోటానికి పాత బల్ల కూడా లేదు.

నన్ను నేను పరిచయం చేసుకున్నాను. హాస్పిటల్‌లో ఉండి వారి దినచర్యను ఎలా గమనించిందీ చెప్పాను. ముసలాయనను గురించి వాకబు చేశాను.

'ఏం చెప్పను నాయనా మా పరిస్థితి? ఆయన్ని చూద్దువుగాని లోపలికి రా."

మంచం మీద కళ్లు మూసుకొని పడుకొని ఉన్నాడాయన. బాగా బలహీనంగా ఉన్నట్లు ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసాలే తెలుపుతున్నాయి.

"జబ్బేమిటి? డాక్టరుకు చూపించారా? నేను చేయగలిగిన సహాయం ఏమన్నా ఉంటే చెప్పండి. చేస్తాను. డబ్బు విషయం ఆలోచించకండి."

ఆమె మెల్లగా నవ్వింది. ఆ నవ్వే నా మాటల్లో పొరపాటును నాకు తెలియచెప్పింది.

'ఆ అభిమానం చాలు నాయనా. ఆయన వ్యాధి మందులతో తగ్గేది కాదు.'

"కానీ అసలు మీ సమస్య ఏమిటి? ఈ ఇంట్లో మీ ఇద్దరే ఎందుకుంటున్నారు? మీ వాళ్లెవరూ లేరా? ఈ పాడుబడ్డ ఇల్లును అమ్మేసుకుని ఎక్కడికైనా వెళ్లిపోవచ్చు కదా?"

మంచంలోని ముసలాయన పెద్దగా మూలిగాడు. నిజానికి అది మూలుగు కాదు. ఆక్రందన! ఆవేదన!


'అంటే నువ్వు కూడా ఈ ఇంటిని బేరం చేయటానికి రాలేదు కదా?"

"లేదు. మీ సమస్య ఏమిటో తెలుసుకుందామనే ఆ మాటను అన్నాను. క్షమించండి."

"ఇప్పుడు మా సమస్య ఇల్లే. కానీ అసలు సమస్య అంతకన్నా లోతైనది. ఆ కథ ఆయన నోటి వెంటే విందువుగాని. లేపుతా ఉండు."

ఆమె ముసలాయన పక్కన కూర్చుంది.

"ఏమండీ! ఈ అబ్బాయెవరో మనకు సాయం చేస్తానంటూ వచ్చాడు. కాస్త కళ్లు తెరిచి మాట్లాడండి."




కళ్లు తెరవగానే ఆయన నన్నడిగిన ప్రశ్న -

"మీ తాత గారి పేరేమిటి?"

మా తాత తండ్రుల పేర్లు వారి వివరాలతో సహా చెప్పాను.

"ఏమిటీ? చేబియ్యం వారి అబ్బాయివా? అయితే కథ చెప్తాను కూర్చో." ఆయన హుషారుగా లేచి కూర్చున్నాడు.

*** *** ***

"ఈ భవంతి సోమసూర్య జమిందారు గారిది. నేను వారి ఇంటి వేద పురోహితుడిని. నా పేరు యజ్ఞనారాయణ. నాకు పెద్ద సంసారమే ఉంది. కూతుళ్లు, కొడుకులు ధనార్జనలో పడి ఎక్కడో ఉన్నారు. మనవలు, మనవళ్లు చాలా మంది ఉన్నారు. ఎక్కడికి వెళ్లినా మా బ్రతుకులు సుఖంగా వెళ్లిపోతాయి. కానీ నే నెక్కడికీ వెళ్లను. వెళ్లలేను. అందుకు అనేక కారణాలున్నాయి. వాటిలో ముఖ్యమైనది. మా బాబుగారు నా చేతికి తగిలించిపోయిన బంగారు సంకెళ్లు."

ఆయన ఆయాసంతో కాస్సేపు ఆగాడు. కూర్చునే ఓపిక లేక మంచం మీదికి వాలాడు.

"సోమసూర్యుడు గారు నిజంగా ఆ సూర్య భగవానుడి అంశతో జన్మించిన వారు. సూర్యుడెంత పవిత్రుడో అంత పవిత్రంగా జీవించాడు.

"వేదాలు చదివాడు. సంగీతం నేర్చుకున్నాడు. కవిత్వం చెప్పాడు. నాట్య సిద్ధాంతాలు రచించాడు. ఆ కళల్లో ప్రవేశమున్న వారంటే ఆయనకు మహా అభిమానం. వారి సేవే పరమాత్మ సేవని ఆయన విశ్వాసం.

"అలాగని ఆయన ఛాందసుడా అంటే కాదు. ఆయనకు ఆంగ్లభాషా సాహిత్యాలలో గల పాండిత్యాన్ని చూచి మహా మహా ఆంగ్ల విద్వాంసులే విస్తుపోతుండేవారు.

"ఆయన తెల్లదొరలతో కలిసి క్రికెట్ ఆడేవాడు. రేసులకి కూడా అప్పుడప్పుడు వెళ్లేవాడు.

"కానీ ఆయన వారి ప్రభావానికి ఎన్నడూ లోనుకాలేదు. కాగా వారిని ఆకర్షించాడు. ఎందరినో తన వేద పాండిత్యంతో మెప్పించాడు. భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని చెప్పి ప్రభావితుల్ని చేశాడు.

"సోమసూర్యుడు గారికి వేదవ్యాసుడు ఒక్కడే కొడుకు. అతను కూడా ఇటు వేదశాస్త్రాలలోను, అటు ఆంగ్ల విద్యల్లోనూ ప్రవీణుడయ్యాడు.

"కానీ అతను సోమసూర్యుడు గారిలా ఆంగ్లేయులను తన ప్రభావంలోకి లాక్కువెళ్లే ప్రయత్నం చెయ్యలేదు. ఆంగ్లేయుల ఆచార సంప్రదాయాల ప్రభావంలో తనే పడిపోయాడు.

"అతను సిగరెట్లు తాగేవాడు. తాగుడు అలవాటు చేసుకున్నాడు. మాంసం కూడా తినేవాడు. వేషభాషల్లో కూడా ఆంగ్లేయులనే అనుసరించేవాడు.

"చివరి కతను సోఫియాను ప్రేమించాడు. ఆమె ప్రేమను అర్థిస్తూ ఆమె చుట్టూ తిరగసాగాడు.

"సోఫియా ఒక ఆంగ్ల అధికారి కూతురు. సోమసూర్యుడి గారి అంతస్తుతో పోలిస్తే వారిది చాలా తక్కువ అంతస్తు. అయినా వారు తెల్ల తోలు కల వారు. పైగా సోఫియా తండ్రికి తాను ఐసిఎస్ అధికారినన్న గర్వం ఉంది. అంచేత తన కూతురు ప్రేమలోపడిన వేదవ్యాసుడిని చాలా చులకనగా చూచేవాడు.

"ఇదంతా సోమసూర్యుడు గారికి తెలిసి చాలా బాధపడ్డారు.

"నాయనా వ్యాస్! ఎంతటి మహావృక్షమైనా 'రూట్స్'ను తెగగొడ్తే ఎండిపోయి కూలిపోతుంది. మనిషి మనుగడకి, జాతిమనుగడకి కూడా 'రూట్స్' అంత ముఖ్యం నాయనా. రూట్స్ బలంగా ఉంటేనే జాతి బలంగా ఉంటుంది. జాతి బలంగా ఉంటేనే మనిషి బలంగా ఉంటాడు. అదృష్టవశాత్తూ భారతీయమైన 'రూట్స్' చాలా బలమైనవి. అందుచేతనే ఎన్నెన్నో ప్రయత్నాలు చేసి కూడా ఎవ్వరూ ఈ జాతిని సమూలంగా

నాశనం చెయ్యలేకపోయారు. ఆంగ్లేయులు మన రూట్స్‌ను పెకిలించేయాలని ప్రయత్నిస్తున్నారు. దాని ప్రతిఘటించాల్సిందిపోయి నువ్వేస్వయంగా నీ చేతులతో 'రూట్స్'ను తెగకొట్టుకుంటున్నావు. భావ్యమా నాయనా? అంధానుకరణం వలన మనిషికి విలువ పెరుగదు నాయనా. ఆంగ్లేయ వనితను పెళ్ళి చేసుకున్నా వారి ఆచార సంప్రదాయాలను ఎంతగా పాటించినా, నీ మతం మార్చుకున్నా తెల్ల తోలును ఎంత కప్పుకొన్నా నిన్ను వారు ఆంగ్లేయునిగా చూడరు. భారతీయుడిగానే - భ్రష్టుడైన భారతీయుడిగానే పరిగణిస్తారు. అది గుర్తించు. నీ ధోరణి మార్చుకో."

"తండ్రి మాటలు వేదవ్యాస్ తలకెక్కలేదు.

"ఐసిఎస్ ఆఫీసరు విధించిన షరతులు అన్నింటికీ అంగీకరించి సోఫియాను పెండ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే వారితోపాటు లండన్ వెళ్ళిపోయాడు.

"కొడుకు చేసిన పని సోమసూర్యుడిని ఎంతగానో కృంగదీసింది.

"అయినా ఆయన పైకి గంభీరంగానే ఉండేవారు.

"వేద విద్యల అభ్యున్నతికి, భారతీయ సంస్కృతీ రక్షణకు కృషి చేస్తున్న సంస్థలెన్నింటికో ఆయన రహస్యంగా తన ఆస్తినంతా దానం చేసారు.

"చనిపోయే ముందు ఆయన రహస్యంగా నన్ను పిలిపించాడు.

"యజ్ఞ నారాయణగారూ! నే నొక పొరపాటు చేశానండీ. ఆ పొరపాటును సరిదిద్దుకొనే సమయం నాకు ఇప్పుడు లేదు. మీరు సరిదిద్దగలరా?"

"చెప్పండి. మీ ఆజ్ఞ శిరసావహిస్తాను."


"ఏంలేదు. నే నింతవరకు నా దేశాన్ని గురించే ఆలోచించాను. కానీ నేను పుట్టి పెరిగిన ఈ ఊరిని గురించి ఆలోచించలేదు. నా ఈ ఇంటిని గురించి ఆలోచించలేదు.

"ఈ ఇంటిని ఇవాళ మీ చేతుల్లో పెడుతున్నాను. తానంత తాను శిథిలమైతే తప్ప ఈ ఇంటిని మీరు అమ్మరాదు. మూలమైన ఆకృతి చెడకుండా కాలానుగుణంగా ఎన్నయినా మార్పులు చేసుకొనే అధికారం మీకుంది. ఈ ఇంటిని మీరు వేద నిలయంగా మార్చాలి. విద్యార్థుల వేద ఘోషలతో ఈ ఇల్లు ఉభయ సంధ్యలా మార్మోగిపోవాలి. ఆ వేద నాదంతో నా రాజమహేంద్రపుర పట్టణం పవిత్రంగా ఎల్లప్పుడూ భాసించాలి. ఇది నా కోరిక. ఇందుకు తగిన ఆర్థిక ఏర్పాటు నేను చేశాను. మీ జీవితకాలంలో, ఎప్పుడైనా నా వారసులెవరైనా ఇక్కడ ఉండిపోవటానికి వస్తే వారికి ఈ కార్యాన్ని అప్పచెప్పండి. లేని పక్షంలో మీ ఇష్టం వచ్చినట్లుచెయ్యండి."

"భారతాంధ్రీకరణ చేయమని నన్నయ భట్టును కోరిన రాజరాజ నరేంద్రుడు నా కాక్షణంలో గుర్తుకొచ్చాడు.

"సోమసూర్యుడు గారు రాజరాజనరేంద్రు డంతటి వాడు కావచ్చు.

"కానీ నేను అల్పప్రాణిని. నన్నయ కున్నంత శక్తి నా కెక్కడుంది?




"పైగా కాలం చాలా వేగంగా మారిపోసాగింది. వేద పండితుల కొడుకులే అమెరికాకు ఎగిరిపోవాలని ఆరాటపడే కాలం వచ్చింది. నిజానికి నా కొడుకులే నా మాట వినలేదు.

"అయినా సోమసూర్యుడి గారి లక్ష్యం గొప్పది.

"అందుకే ఆ లక్ష్య సాధనకు ఎన్నో ప్రయత్నాలు చేశాను.

"కొన్ని మార్లు విజయాలు - మరికొన్నిమార్లు పరాజయాలు!

"పదేళ్ళుగా అన్నీ పరాజయాలే.

"ఎన్ని ఆశలు పెట్టినా వేద విద్య నేర్చుకోవటానికి ఎవరూ రావటంలేదు. రాజకీయంగా పలుకుబడి ఉన్న పెద్దలను ఆశ్రయిద్దామంటే భయం. ఒక్కసారి వారికి అవకాశం కల్పిస్తే.... ఒంటె బాటసారి కథ గుర్తుకొచ్చేది. ఎన్ని మహా సంస్థలు రాజకీయ ప్రమేయాల వల్ల నా కళ్ళముందు నాశనం కాలేదు? అలా జరగటం నా కిష్టంలేదు.

"ఈలోగా ఊళ్లో పెద్దలకి ఈ ఇంటి మీద కన్నుపడనే పడింది. ఈ పాత భవంతిని పడగొట్టి ఆ స్థానంలో ఫైవ్‌స్టార్ హోటలునే, నాలుగు సినిమా థియేటర్ల కాంప్లెక్స్‌నే, అపార్టుమెంటులో కట్టాలన్న ఆశ చాలా మందికి ఉంది.

"ఇప్పు డా ఆశ ఊరి పెద్దలను ఒక్కటి చేసింది. నా పాలిటి మహామ్మారిలా మారింది.

"ఈ స్థితిలో నేనేం చేయాలి? సోమసూర్యుడి గారి ఆశయం నెరవేర్చటం నాకు సాధ్యం కాని పని ఇప్పుడు. కనీసం ఆయన ఇంటిని యథాతథంగానైనా ఉంచలేకపోతే ఎలా? ఈ ఇంటిని అమ్మకూడదన్న ఆయన శాసనాన్ని ఎలా ఉల్లంఘించను? నా సమస్యను అర్థం చేసుకొనే వారెవరు? నాకు సహాయం చేసే వా రెవరు?"

ఆవేశంగా అంటుంటే యజ్ఞ నారాయణ గారికి దగ్గు, ఆయాసం వచ్చింది.

"మీ పక్షాన నేను పోరాడుతాను. సోమసూర్యుడి గారి లక్ష్యసాధనకు మీతో నేను సహకరిస్తాను."

ఆయన చేతుల్లో చెయ్యి వేసి చెప్పాను నేను.

"కానీ సోమసూర్యుడి గారి కుమారుడు ఇప్పుడు ఎక్కడ ఉంటున్నారు? ఆయన పిల్లల కథేమిటి?"

"వేదవ్యాస్ లండన్ వెళ్లాక అతని భార్య సోఫియా సోమసూర్యుడిగారికి ఒకే ఒక్క ఉత్తరం రాసింది. వేదాలంటే, శాస్త్రీయ సంగీతం అంటే, భారతీయ సంస్కృతి అంటే తన కెంత ఇష్టమో ఆమె అందులో రాసింది. ఆ తర్వాత వారి విషయాలేమీ తెలియవు. సోమసూర్యుడు గారు చనిపోయినప్పుడు నే నా వార్తను వారికి తెలియపర్చాను, వారు రాలేదు. సమాధానం కూడా లేదు."

ఆ రాత్రంతా బాగా ఆలోచించి మర్నాడు వేదవ్యాస్ గారికి ఉత్తరం రాయించాను.

*** *** ***

కానీ ఊరి పెద్దలు మహా మేధావులు. వారప్పటికే విషయాన్ని చాలా దూరం తీసుకెళ్లారు.

సోమసూర్యుడి గారి గొప్పతనాన్ని సభలు పెట్టి పొగిడేవారు. పండితుల చేత పొగిడించారు.

ఆయన కోరిక వేద విద్యాభివృద్ధి. ఆ కోరికను తీర్చటంలో యజ్ఞనారాయణ గారు విఫలమయ్యారు. పైగా ఆయనిప్పుడు వృద్ధులైపోయారు. కనుక ఆ బాధ్యతను పౌరులే తీసుకోవాలన్నారు. అందుకుగాను ఒక కమిటీని ఏర్పాటు చేశారు.

నేను లీగల్‌గా ఎన్నో అభ్యంతరాలను లేవదీశాను. కానీ లీగల్‌గానే సమాధానం చెప్పి, నా పాయింట్లను కొట్టిపారేశారు.

సోమసూర్యుడు గారు రాసిపోయిన పత్రాలలో ఎన్నో లొసుగులున్నాయి. ఆ లొసుగులు ఇప్పుడు వారికి వరాలయ్యాయి.

చివరికి ఆ ఇంటిని వేలం పాటలో అమ్మాలన్న నిర్ణయానికొచ్చారు. అలా వచ్చిన డబ్బుతో వేద విద్యాలయాన్ని ఏర్పాటు చేస్తారట. అందుకు

అవసరమైన ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేశారు.

ఇవాళ అమ్మాలన్న తీర్మానం లాంఛనంగా అంగీకరించి ఇంటిని వేలం వేసే సమయాన్ని నిర్ణయించటానికి సభ జరుగుతోంది.

యజ్ఞ నారాయణ గారు చాలా రోజులుగా కళ్లు తెరవడంలేదు. నోరు తెరిచి మాట్లాడటంలేదు. అన్న పానీయాలను ముట్టడంలేదు.

ఆలోచించి ఆలోచించి చివరికి నే నో నిర్ణయానికొచ్చాను.

"యజ్ఞ నారాయణగారూ! అమ్మటం దాకా వస్తే ఈ ఇంటిని నేనే కొంటాను. ఆ మాయావుల చేతుల్లోకి పోనివ్వను."

అది నా శక్తికి మించిన పని. అయినా అంతకన్నా నేను చేయగలిగిందేమీ లేదు.

"వద్దు నాయనా! మహా పర్వతంతో పొట్టేలు పిల్ల ఢీకొని లాభం లేదు. అధర్మాన్ని అన్యాయాన్ని ఎదుర్కొనే శక్తిని ధర్మం కోల్పోయింది. ఎలా జరగాలో అలాగే జరగనీ -"

సాయంకాలం సభ ప్రారంభమయింది.

వేద వ్యాసుడు కాని, అయన వారసులుకాని వస్తారన్న ఆశ నాకు ఆ ఉదయం వరకు ఉంది. వాళ్లెవరైనా వస్తే ఆ ఇల్లు నిలుస్తుంది. ఆ ఇంటికి లీగల్‌గా హక్కుదార్లు వారు.

కానీ వారు వస్తారన్న ఆశయినా లేదు.

ఏం చేయాలి?

తీర్మానాన్ని ప్రతిఘటించాను. నాతో కొన్ని గొంతులు కలిశాయి.

"తనంత తాను శిథిలమైతే తప్ప ఈ ఇల్లును అమ్మరాదన్నది సోమసూర్యుడి గారి కోరిక. ఇపుడు ఆ ఇల్లు తనంత తాను శిథిలమయింది. ఇది శిథిలం కాకుండా కాలానుగుణమైన మార్పులు చేసేబాధ్యత గల యజ్ఞ నారాయణ గారు వృద్ధులైపోయారు. ఈ ఇంటిని వేద నిలయంగా మార్చాలన్నది సోమసూర్యుడిగారి కోరిక. అంతేకాదు. ఆ వేద నాదంతో రాజమహేంద్రపురం పవిత్రంగా భాసించాలన్నది ఆయన అన్ని కోరికలకు మూలం. అందుకు అనువైన ప్రదేశం కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న ఈ ఇల్లు కాదు. ఈ ఇంటి చుట్టూ ఉన్న వాతావరణం వేద నాదాల్ని కూడా కలుషితం చేస్తుంది. కనుక చక్కటి ప్రశాంత వాతావరణంలో ఆ పని జరగాలి. అందుకు ఈ ఇల్లును అమ్మటం అవసరం." ఒక రాజకీయ తర్కశాస్త్ర పండితుడు ఆవేశంగా ఉపన్యాసిస్తున్నాడు.

"అందుకు ఈ ఇంటిని అమ్మాల్సిన అవసరం లేదు."

తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఆ మాటలు వినిపించాయి. అంతా ఆ వ్యక్తి వైపు చూచారు.

పాతికేళ్ల యువకు డతను. తెల్లటి మేనిఛాయ. మొహాన విభూతి రేఖలు. భృకుటి మధ్య భాగంలో ఎర్రని కుంకుమ బొట్టు. అచ్చం ఫోటో సోమసూర్యుడు గారిలాగా ఉన్నాడు.

"కాగా ఈ ఇంటిని అమ్మే అధికారం ఎవరికీ లేదు."

"ఎందుకని?"

"ఎందుకంటే ఈ ఇంటికి వారసుడిని నేను. సోమసూర్యుడిగారి మనవడిని. నా పేరు కూడా సోమసూర్యుడే."

పెద్దల మొహాలు పాలిపోయాయి. జనంలో కలవరం -

"కావచ్చు. కానీ ఇన్నేళ్లుగా ఈ ఇంటి మొహం చూడని వారసుడుగారు ఇపుడు ఎందుకు వచ్చినట్లో? ఇల్లు అమ్ముకొనిపోదామనే కదా? ఆ పనిని మేమే చేసిపెట్టామంటున్నాము. ఇక అభ్యంతరం ఏముంది?"

"ఉంది. ఎందుకంటే నేను ఇల్లు అమ్ముకుపోవటానికి రాలేదు. నేను ఇంగ్లాండు నుంచి ఇక్కడ - నా మాతృ భూమిలో స్థిరపడిపోదామని వచ్చాను. నా పూర్వీకుల ఇంటిని వేద నిలయంగా, భారతీయ సంస్కృతీ కేంద్రంగా మార్చటానికి, నా దేశ మేధావుల్లో వేద విజ్ఞాన జ్యోతిని వెలిగించటానికి వచ్చాను."

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ యజ్ఞ నారాయణ గారు లోపలి నుంచి వచ్చారు. ఆయన పాదాలకు నమస్కరించా డతను.

"మీ ఉత్తరం ఎపుడో అందినా ఇంత ఆలస్యంగా వచ్చినందుకు నన్ను క్షమించండి. అందుకు అనేక కారణాలున్నాయి. నేను కంప్యూటర్ సైంటిస్టుని. వేద విద్య నేర్చుకోవటం కోసం ఇపుడు మీ పాదాలను ఆశ్రయిస్తున్నాను. నాకు నిజమైన జ్ఞానభిక్ష పెట్టండి."

"నువ్వా!"

"అవును. ఒకప్పుడు కూటి కోసం వేద విద్యను నేర్చుకొనే వారు. ఆ కాలంపోయింది. విజ్ఞాన ప్రగతికి వేద విద్య ఎంతగానో తోడ్పడుతుందని ఇపుడు పాశ్చాత్య మేధావులు గుర్తించారు. సృష్టి రహస్యాలను తెలుసుకోటానికి వేద విజ్ఞానం చాలా అవసరమని ఇప్పటికైనా భారతీయ మేధావులు గుర్తించాలి. మా తాతగారు ఆయన కాలానికి తగ్గట్లు వేద విద్యను ప్రోత్సహించారు. నేను నా కాలానికి అవసరమైన విధంగా వేద విద్యను వ్యాప్తి చేస్తాను. అందుకు ముందుగా నేను మీ శిష్యుడి నవుతున్నాను. ఈ సోమసూర్యుడి నిలయం ఇక మేధావుల నిలయమవుతుంది."

ఇది కొత్త నీరు. అన్ని రకాల మురికిని క్షాళనం చేసే శక్తి ఈ నీటికి ఉందనిపించింది నాకు.

యజ్ఞ నారాయణగారు అతడిని లేవదీసి గుండెలకు హత్తుకున్నాడు. అతని చేతిలో ఆ ఇంటి తాళం చెవులను పెట్టారు.

## సర్వం ధనమూలం

అమెరికాలో మోరీలాండ్ అనే ప్రాంతంలో ఒక చర్చ్ ఉంది. ఆ చర్చి అధిపతి కిమ్ కొసెక్కర్‌కు ఒకానొక ఆదివారంనాడు ఒక బృహత్తరమైన ఉపాయం తట్టింది.

ఈ రోజుల్లో భక్తులు చర్చికి తక్కువగా వస్తున్న కారణ మేమిటా అని ఆయన జుట్టు పీక్కుంటూండగా పుటుక్కుమని ఓ ఐడియా కూడా తెగి పడింది. 'ఇప్పుడు చర్చిలు చందాలు వసూలు చేస్తున్నాయి కదా! అలా కాక కొత్తగా - వచ్చేవారికి మా చర్చిలో పదేసి డాలర్ల చొప్పున ఇస్తామంటూ ప్రకటించడమే' ఆ ఉపాయం. వేంటనే ఈ విషయాన్ని ప్రకటించేశారు. హాజరు రెట్టింపయింది.

ఇలా చేయడం వల్ల ఫలితముంది నరే, మరి భగవంతుడి అనుమతి సంగతో అని అడిగితే కొసెక్కర్ - 'నో కామెంట్!' అనేశారట!

